హమ్మయ్య..తెరిపిచ్చిన వాన


రుషికొండ బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: వారం రోజుల నుంచి అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షంతో నగరమంతా తడిసి ముద్దయింది. చిన్నారుల, పెద్దలు, వృద్ధులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఆదివారం వర్షం తెరిపివ్వడంతో నగరవాసులు సరదాగా బయటకు వచ్చారు. వారం రోజుల నుంచి బోసిపోయిన పర్యాటక ప్రాంతాలు కళకళలాడాయి. భీమిలి బీచ్ నుంచి సాగర్‌నగర్ బీచ్ వరకు పర్యాటక ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. చిరు వ్యాపారులు, వ్యాపారులు, ఫొటోగ్రాఫర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు వ్యాపారాలు ఊపందుకున్నాయి.

ఉత్సాహంగా సింగర్స్ పిక్నిక్



భీమునిపట్నం: విశాఖకు చెందిన మనో మెలోడీస్ ఆధ్వర్యంలో సింగర్స్ పిక్నిక్ ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలు వద్ద ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఇందులో పాల్గొన్న సభ్యులందరు పాటలు పాడుతూ సందడిగా గడిపారు. గాయకులు ఫణి భూషణ్‌రావు, మనోపల్లా, ఉమాభూషణ్, జ్యోతి, బాబూరావు, గణేష్, మనోహర్, రంజిత పాల్గొన్నారు.

తాబేళ్ల మృత్యువాత


తీరానికి కొట్టుకొచ్చిన తాబేళ కళేబరం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం తీర ప్రాంతానికి ఆదివారం ఉదయం రెండు తాబేళ్ల కళేబరాలు కొట్టుకొచ్చాయి. రెండు రోజుల నుంచి భీమిలి, ఉప్పాడ, మంగమారిపేట తీర ప్రాంతాలకు పెద్ద ఎత్తులో తాబేళ్ల కళేబరాలు కొట్టుకొస్తున్న సంగతి తెలిసిందే. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తుంటాయి. ఈ క్రమంలో మృత్యువాత పడుతున్నాయి. ఇవి మృతి చెందడానికి కారణాలు తెలియరావడం లేదు.

క్లుప్తంగా

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పద్మనాభం: మరికొన్ని రోజులు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం తెలిపారు. ఆరుబయట ఉన్న ధాన్యంపై టార్పాలిన్లు కప్పి ఉంచాలని ఏవో సూచించారు.

సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


చిట్టివలసలో సీపీఎం మహాసభల పోస్టర్ విడుదల చేస్తున్న ఆ పార్టీ నేతలు

తగరపువలస: ఈ నెల 28, 29 తేదీల్లో పెందుర్తిలో జరగనున్న సీపీఎం జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఆదివారం చిట్టివలసలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన స్టీల్‌ప్లాంట్, సింహాచలం పంచ గ్రామాల సమస్య, గాజువాక ఇనాం భూముల సమస్య, కుసులవాడ మైనింగ్ తదితర సమస్యలను రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రస్తావించనున్నారన్నారు. ఆదివారం పెందుర్తి జూనియర్ కళాశాల ఆవరణ నుంచి సుజాతనగర్ వరకు మహా ప్రదర్శన అనంతరం బహిరంగసభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, వి.నాగరాజు, కె.నాగరాణి, భాగం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులవారికి సాయం


దుప్పట్లు, ఇతర సామగ్రీ అందజేస్తున్న శ్రీరామ్

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంచార జాతులవారికి సాయం అందజేశారు. శనివారం రాత్రి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ భీమిలి, తగరపువలస, వేములవలస, వలందపేట, మోదవలస ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఉంటున్న సంచారజాతి వారికి తన తండ్రి కలిగొట్ల భాస్కరరావు వర్ధంతి సందర్భంగా దుప్పట్లు, స్టీల్‌బేషిన్లు, చీరలు, దుస్తులు అందించారు.

చీటీల సొమ్ము ఎగవేతదారులపై కేసు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు నమ్మివానిపేటకు చెందిన సరగడ పార్వతి ఆమె భర్త లక్ష్మణపై చీటీల సొమ్ము ఎగవేసిన కారణంగా భీమిలి సీఐ బి.సుధాకర్ కేసు నమోదు చేశారు. ఇదే వార్డు వలందపేటకు చెందిన కొసన అప్పలకొండ తదితరులు 2020 నుంచి పార్వతి వద్ద పప్పుల చీటీలతో పాటు వరలక్ష్మి, దసరా చీటీలు వేస్తున్నారు. మొదట్లో సక్రమంగా చెల్లించినా 2022 నుంచి చీటీల సొమ్ము చెల్లించకుండా వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు పార్వతి ఆమె భర్త లక్ష్మణ రూ.47.40 లక్షలు చీటీల సొమ్ము బకాయిలు ఇవ్వవలసి ఉన్నట్టు గుర్తించారు. చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గోతుల్లో వర్షపు నీరు


జ్యూట్‌మిల్లు కల్యాణ మండపం ఆవరణలో చెరువులా మారిన ప్రదేశం

తగరపువలస: చిట్టివలస కార్మికవాడలో పలుచోట్ల వర్షంనీరు నిలువ ఉండిపోవడంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ఆటస్థలాన్ని ఆనుకుని ఉన్న కల్యాణమండపం ముందు గోతులలో వర్షంనీరు నిండిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి.

అన్నదాత కన్నీరు


బకెట్‌తో నీటిని తోడుతున్న రైతు


పాండ్రంగిలో నీట మునిగిన వరి గాలి దిబ్బలు

పద్మనాభం: నాలుగు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు పంట చేలల్లో నీరు నిల్వ ఉండి పోయింది. దీంతో రైతన్నలు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. పద్మనాభం, కృష్ణాపురం, మద్ది, తునిపాలెం గ్రామాల్లో రైతులు రబీ సీజన్‌లో మొక్క జొన్న పంట వేశారు. పంట వేసి 10 నుంచి 15 రోజులు అవుతుంది. మొక్కలు వచ్చిన సమయంలో వర్షం ఎడతెరపి లేకుండా కురవడంతో నీరు నిల్వ ఉండిపోయింది. దీని వల్ల మొక్కలు రాకుండా వేసిన విత్తనాలు పనికి రాకుండా పోయాయి. ఎకరం విస్తీర్ణంలో మొక్కజొన్న పంట వేయడానికి రైతన్నలు సుమారు రూ.10 వేలు పెట్టుబడి పెట్టారు. వర్షం వల్ల పెట్టుబడంతా బూడిదలో పోసిన పన్నీరైంది. మునివానిపాలెంలో రబీ సీజన్‌లో దాల్వా వరి వేయడానికి వేసిన ఆకుమడిలో నీరు నిల్వ ఉండిపోవడంతో నారు చనిపోయే పరిస్థితులు నెలకొనడంతో రైతన్నలు లబోదిబో మంటున్నారు. నారును కాపాడుకోవడానికి రైతన్నలు మడిల్లో నుంచి బకెట్లతో నీటిని పైకి తోడుతున్నారు. పాండ్రంగిలో చిరత గట్టు వద్ద రైతులు ఖరీఫ్‌లో వేసిన వరి పంటను కోసి గాలి దిబ్బలు పెట్టారు. నూర్పక ముందే వరుణుడి ప్రతాపానికి వర్షపు నీటిలో మునిగిపోవడంతో ధాన్యం మొలకలు వచ్చి ఎందుకు పనికి రాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పద్మనాభంలో మొక్క జొన్న క్షేత్రంలో వర్షం నీరు

బిక్కుబిక్కుమంటూ..

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లిలో ఏఎన్ఎం సబ్ సెంటర్ భవనం ఏ క్షణంలో కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వైద్యానికి వచ్చే రోగులకు ప్రమాదం పొంచి ఉండడంతో భయాందోళన చెందుతున్నారు. ఈ సబ్ సెంటర్‌లో నలుగురు ఆశాలు, ఒక ఏఎన్ఎం, ఒక ఎంఎల్‌హెచ్‌పీ, నలుగురు హెల్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనాన్ని 1999లో నిర్మించారు. నిర్మించి 25 ఏళ్లు అవడంతో భవనం శిథిలావస్థలో కొట్టుమిట్టాతోంది. రెడ్డిపల్లి మేజర్ పంచాయతీ కావడంతో రోగులు ఎక్కువగా ప్రాథమిక చికిత్స కోసం ఈ సెంటర్‌కు వస్తుంటారు. ఈ పంచాయతీ పరిధిలో రెల్లిపేట, భద్రయ్యపేట, సుంకరపేట, రామన్నపేట, మత్రిబంద కళ్లాలు ఉన్నాయి. ఈ ఆవాస ప్రాంతాల్లో సుమారు 8 వేల మంది జనాభా ఉన్నారు. వీరందరూ ఏఎన్ఎం సెంటర్‌కు ప్రాథమిక వైద్యానికి వస్తారు. నాలుగు రోజుల నుంచి వర్షాలు జోరుగా కురుస్తుండంతో శ్లాబు పెచ్చులూడి సిబ్బంది మీద పడిపోతుంది. వర్షాలకు కారిపోతుంది. దీని వల్ల సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక చికిత్స కోసం వచ్చే రోగులకు రక్షణ కొరవడింది.


వర్షాలకు పెచ్చులూడి మీద పడడంతో ఆందోళనలో ఏఎన్ఎంలు

అమిత్‌షాను భర్తరఫ్ చేయాలి


మాట్లాడుతున్న మాలమహానాడు వ్యవస్థాపకుడు గోపాల్

తగరపువలస: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం భీమిలి మండలం తాళ్లవలస అంబేడ్కర్ కూడలి వద్ద అంబేడ్కర్ యువజన సంఘం రాస్తారోకో నిర్వహించింది. ఈ సందర్భంగా మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు భాగం గోపాలరావు మాట్లాడారు. అంబేడ్కరు పేరును వ్యంగ్యంగా ఉచ్ఛరించడం కొందరికి ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. కేంద్ర హోంశాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో అమిత్‌షా కులమతాలకు అతీతంగా పరిపాలన చేస్తానని చెప్పి..ఇప్పుడు హేళన చేయడం తగదన్నారు. అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు బోని సన్నిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి, నాయకులు చెన్నా సత్యం, బోని నరసింగరావు, హరిబాబు, ప్రసాద్, శివ, సియ్యాద్రి రాంబాబు, మట్టా ఆదినారాయణ, టి.సిద్దార్థ, శ్రీను, యాగంటి రామారావు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా కంటైనర్ల ఏర్పాటు


ఎండాడలో ఏర్పాటు చేసిన కంటైనర్ దుకాణం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ–రుషికొండ వందడుగుల రోడ్డుకు ఆనుకుని ఇష్టానుసారంగా ఎటువంటి అనుమతులు లేకుండా కంటైనర్లు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన కంటైనర్లను జీవీఎంసీ అధికారులు తొలగించారు. మరల ఇవి ఏర్పాటు చేస్తున్నారు. వీటి వలన రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని, కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇష్టానుసారంగా కంటైనర్లు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుని తొలగించాలని ఇక్కడ వారు కోరుతున్నారు.

డి'వై'డర్..!


బురదమయంగా డివైడర్

తగరపువలస : చేసే పనులు పదిమందికీ ఉపయోగపడాలి..అంతేగానీ నిరుపయోగం కాకూడదు. జీవీఎంసీ అధికారులు అభివృద్ధి పనుల పేరిట నిధులు వృథా చేస్తున్నారడానికి ఈ డివైడర్లే నిదర్శనం. అసలు ఈ డివైడర్ ఎందుకు నిర్మించారో వారికే తెలియాలి. తాతా థియేటర్ వరకు ఆరు అంగుళాల ఎత్తులో డివైడర్ గతంలో నిర్మించారు. రెండేళ్ల క్రితం జీవీఎంసీ అధికారులు ఈ డివైడర్‌ను ఎత్తు చేసే సాకుతో రూ.లక్షల నిధులు వృథా చేశారు. డివైడర్‌పై మట్టి వేసి ఊరుకున్నారు. మొక్కల నాటలేదు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు డివైడర్ మొత్తం బురదగా మారింది. రూ.30 లక్షలతో నిర్మించిన డివైడర్ ఎవరికీ పనికిరాకుండా పోయింది.

గణిత మేధావి రామానుజన్‌కు ఘన నివాళి


చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామానుజన్ జయంతి వేడుకలు


ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ అని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. ఆదివారం రామానుజన్ 137వ జయంతి సందర్భంగా హిందీ విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాసులో పుట్టిన రామానుజన్ అతి తక్కువ కాలమే జీవించినప్పటికీ ప్రపంచ దేశాలకు గొప్పవైన గణిత ఆలోచనలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు. చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి ఆధ్వర్యంలో రామానుజన్ జయంతి వేడుకలు జరిగాయి. గణిత అధ్యాపకుడు బి.సీతన్నాయుడు రామానుజన్ సిద్ధాంతాలు, సంఖ్యావాదం, అనంత శ్రేణులు, సంకీర్ణ శ్రేణుల విశ్లేషణ, రామానుజన్ నంబరు 1,729 ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులచే ఎగ్జిబిషన్, పోస్టర్ ప్రజెంటేషన్, రామానుజన్ సిద్ధాంతాలను వివరించారు. ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

వివాహిత అదృశ్యం


నిర్మల (ఫైల్)

మధురవాడ: ఆలయానికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లి వివాహిత అదృశ్యం అయింది. దీనిపై పీఎంపాలెం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. మారికవలస ఆర్‌జీకే కాలనీలో నివాసం ఉంటున్న పి. రాజేష్‌కుమార్ భార్య, ఇద్దరు పిల్లలతో 37వ బ్లాక్ జీఎఫ్–5 అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఇతని భార్య పెదిరెడ్ల నిర్మల శనివారం ఉదయం 10 గంటలు సమయంలో బోయిపాలెం జంక్షన్ వద్ద ఫైడా కళాశాలలో ఉన్న వేంకటేశ్వర స్వామి గుడికి వెళ్తానని చెప్పింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఆచూకీ నిమిత్తం బంధువులు, తెలిసిన వారి ఇళ్లు, ఇతర చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆదివారం సాయంత్రం పీఎంపాలెం పోలీలకు రాజేష్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానం.. దయనీయం


చెరువును తలపిస్తున్న రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు

మధురవాడ: హైవే నుంచి రేవళ్లపాలెం వరకు ఏర్పాటు చేస్తున్న రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఇళ్లు కోల్పోయిన బాధితులకు టీడీఆర్ సమస్య సకాలంలో పరిష్కారం కాకపోవడంతో రోడ్డు నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడ తాత్కాలికంగా వేసిన రోడ్డుపై నీరు నిల్వ ఉండిపోవడం, తర్వాత వచ్చిన పాలకులు కనీస మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.


వాహన దారుల అవస్థలు

సమస్యలతో సహవాసం

- పీర్‌లెస్‌కాలనీలో మౌలిక సదుపాయాలు దూరం
- అందుబాటులో లేని రైతుబజారు
- రహదారుల ఛిద్రం


రోడ్డు మలుపులో ఏర్పడిన గొయ్యి


జాతీయ రహదారి నుంచి పీర్‌లెస్ కాలనీకి వెళ్లే రోడ్డు

పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని పీర్‌లెస్ కాలనీలో నివసిస్తున్న ప్రజలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు. క్రికెట్ స్టేడియానికి ఎదురుగా ఉన్న ఈ కాలనీ వాసులను దీర్ఘ కాలంగా పలు సమస్యలు వేధిస్తున్నాయి. జాతీయ రమదారి నుంచి కాలనీలో వెళ్లడానికి నిర్మించిన ప్రధాన రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోడానికి ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రివేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కాలనీ పొడవునా ప్రధన రహదారిని వెడల్పు చేసి రోడ్డు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కానీలో నిర్మించిన అంతర రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కాలనీలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలిగిలా చర్యలు తీసుకుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే కాలనీలోలోని పార్కును అభివృద్ధి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు బజార్ అందుబాటులో లేక..

కాలనీ వాసులుకు రైతు బజారు అందుబాటులో లేదు. మధురవాడ రైతు బజారే దిక్కు. దూరాభారం కావడంతో సమీపంలోనే కూరగాయలు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఈ ప్రాంతంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆగిపోయిన రహదారి నిర్మాణం

మినీ రైతు బజార్ ఏర్పాటు చేయాలి



కాలనీలో సీనియర్ సిటిజన్స్ కుటుంబాలు అధికంగా ఉన్నాయి. కూరగాయల బజారు అందుబాటులో లేకపోవడంతో నిత్యం ఇబ్బంది పడుతున్నాం. కారుషెడ్ కూడలి ఏరియాలో మినీ రైతు బజారు ఏర్పాటు చేస్తే పీఎం పాలెం లోని వివిధ కాలనీల ప్రజలకు, బింద్రానగర్ పీర్‌లెస్ కాలనీల వాసులకు వెసులుబాటు కలుగుతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కె. అప్పారావు, పీర్‌లెస్ కాలనీ

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలోని శారద రామకృష్ణ సంఘం జయంతి కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సంకీర్తన, ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం శ్రీకృష్ణ కూచిపూడి నృత్య నిలయం విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. రెండు రోజులపాటు జయంతి కార్యక్రమాలు జరగనున్నాయి.

కృష్ణంరాజుపేటలో నగర సంకీర్తన

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో ఆదివారం గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. కృష్ణంరాజుపేట, డొకరపేట గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గ్రామ వికాస ప్రముఖ్ తిరుపతయ్య మాట్లాడుతూ జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి హిందువులంతా తరలిరావాలన్నారు.